క్లుప్తంగా

సవటపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్'

ఐరాల: మండలంలోని సవటపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 56 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనతను నివారించవచ్చని సూచించారు. ఈ క్రమంలోనే పోషకాహారంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్ పాల్గొన్నారు.

గ్రామీణులకు మెరుగైన వైద్యం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కింద గ్రామీణులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ మోహన్‌వేలు వెల్లడించారు. శుక్రవారం మండలంలోని జి.గొల్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా 35 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మృతుడి కుటుంబానికి చెక్కు పంపిణీ

చిత్తూరు అర్బన్: విజయపురం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఈనెల 7న అనారోగ్యంతో మృతి చెందిన తంగరాజు కుటుంబానికి శుక్రవారం ఏఎస్పీ రాజశేఖర్‌రాజు ఆర్థికంసాయం చెక్కును అందజేశారు. విడో ఫండ్ నుంచి రూ. 50వేలు, ఫ్లాగ్ ఫండ్ నుంచి రూ.25వేల చెక్కును మృతుని భార్య వల్లియయ్యకు అందజేశారు. కుటుంబానికి అందాల్సిన ప్రయోజనాలను ఆలస్యం లేకుండా చూస్తామని ఏఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో పార్థసారథి పాల్గొన్నారు.

చెప్పిందే స్టాంప్ రేటు..

లేదంటే వెండర్ పోటు..!

నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లకు డిమాండ్ ఏర్పడింది. ఒక టిన్నర నెల క్రితం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చిన స్టాక్ దాదాపు ఖాళీ అవుతోంది. ఇదే అవకాశంగా స్టాంప్ వెండర్లు అధిక ధరలకు విక్రయిస్తూ దండుకుంటున్నారు. దీనిపై నిఘా కొరవడటంతో ఇష్టారాజ్యంగా అమ్మకాలు కొనసాగిస్తున్నారు. దీంతో కొనుగోలుదారులు అవస్థలు పడుతున్నారు.

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దాదాపు ఖాళీ
- పదిశాతం స్టాకు కూడా నిల్!
- ఇదే అదునుగా అధిక ధరలకు దండుకుంటున్న వెండర్లు



స్టాంప్‌పేపర్



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాకు నాసిక్ నుంచి స్టాంప్ పేపర్ల స్టాకు అక్టోబర్‌లో వచ్చింది. వీటిని నవంబర్‌లో ఆయా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు అందజేశారు. జిల్లాలోని 8 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు గత నెలలో రూ.50, రూ.100 పేపర్లు 72 వేలు అందజేశారు. ఇందులో చిత్తూరు, పుంగనూరు, పలమనేరు, కుప్పం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు 11,000 పేపర్లు, నగరికి 8,000, బంగారుపాళ్యం, చిత్తూరు రూరల్స్‌కు 7,000, కార్వేటినగరానికి 6,000 పేపర్లు అందజేశారు. చిత్తూరు అర్బన్ కార్యాలయంలో దాదాపు స్టాక్ ఖాళీ అయిపోయింది. మిగిలిన ప్రాంతాల్లోనూ కొరత ఉంది. జిల్లాలో మొత్తం 118 మంది లైసెన్స్‌డు స్టాంప్ వెండర్లు ఉన్నారు. ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి వీరు స్టాంపులు తీసుకెళ్లి అమ్ముతుంటారు. వీరు అధిక ధరలకు విక్రయిస్తున్నారని కొనుగోలుదారులు గగ్గోలు పెడుతున్నారు.

ఒక పేపర్‌కు మించి ఇవ్వడం లేదు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్టాక్ లేకపోవడంతో ఒక పేపర్‌కు మించి వినియోగదారులకు ఇవ్వడం లేదు. దీంతో ఎక్కువ కావాల్సిన వారు స్టాంప్ వెండర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో అదనంగా పేపర్ పై రూ.30–50 చెల్లించి తీసుకోవాల్సి వస్తోంది. ముఖ్యంగా తక్కువ స్టాంప్‌పేపర్లు పొందిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో స్టాంప్ వెండర్లు పేపర్‌పై మరింత అధికంగా వసూలు చేస్తున్నారు. ఈ- స్టాంప్ పేపర్ల కంటే నాన్‌జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లు నాణ్యతతో కూడినదని, ఎక్కువ కాలం మన్నిక వస్తుందని వినియోగదారులు భావిస్తున్నారు. క్షేత్రస్థాయిలో రూ.10, రూ.20 స్టాంప్‌పేపర్ల కొరత పీడిస్తోంది. వీటిని వెండర్లు రూ.40–60 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తే గానీ వారిపై చర్యలు తీసుకోవడం లేదు. గతంలో నకిలీ రిజిస్ట్రేషన్లు జరిగిన సమయంలో ఒకరిద్దరు వెండర్ల లైసెన్స్ తాత్కాలికంగా నిలిపివేశారు. కానీ తర్వాత అధిక ధరలపై ఫిర్యాదులు వచ్చినా వారిపై చర్యలు శూన్యం. విజిలెన్స్ అధికారుల తనిఖీలు లేకపోవడంతో వెండర్లు చెప్పిందే రేటుగా మారింది. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి స్టాంపులను నిర్ణీత ధరలకే విక్రయించేలా చర్యలు తీసుకోవాలని స్థిరాస్తి, క్రయ, విక్రయదారులు కోరుతున్నారు. వెండర్లు విక్రయించే అధిక మొత్తంలో కొంత భాగం ఉద్యోగులు, అధికారులకు పర్సంటేజీ ఉందనే విమర్శలు కూడ వస్తున్నాయి. ఈ కారణంగానే అధికారులు ఏ చర్యలూ తీసుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

కార్యాలయాల వారీగా ఇచ్చిన స్టాంప్ పేపర్లు

కార్యాలయం	రూ.50 (స్టాంప్‌పేపర్లు)	రూ.100 (స్టాంప్‌పేపర్లు)
చిత్తూరు అర్బన్	5,000	6,000
పుంగనూరు	5,000	6,000
పలమనేరు	5,000	6,000
కుప్పం	5,000	6,000
నగరి	4,000	4,000
బంగారుపాళ్యం	3,000	4,000
చిత్తూరు రూరల్	3,000	4,000
కార్వేటినగరం	2,000	4,000
మొత్తం	32,000	40,000

స్టాక్ లేదంటున్నారు



జనవరి నుంచి భూముల ధరలు పెరగనుండడంతో సెటిల్‌మెంట్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంది. అందుకని స్టాంప్ పేపర్ల కోసం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు వస్తే స్టాక్ లేదంటున్నారు. రిజిస్ట్రేషన్‌కు కనీసం 5 పేపర్లు అవసరం ఉంది. ఇంక దిక్కు లేక బయట ఎక్కువ డబ్బులు ఇచ్చి కొనుకోవాల్సి వచ్చింది.

–మధు, చిత్తూరు

పేపర్లు లేక ఇబ్బందులు



ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రైటర్ దగ్గరికి వెళ్లితే స్టాంప్ పేపర్లు తెమ్మన్నారు. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్లి అడితే లేవంటున్నారు. ఇలాగైతే ఎలా.. స్టాంప్ పేపర్ కావాలంటే బయట కొనాల్సిందేనా? ఈ-స్టాంప్ పేపర్ కన్నా రిజిస్ట్రార్ ఆఫీసులో అమ్మే పేపర్లకు మన్నిక, లైఫ్ అంటారు. కానీ ఇక్కడ అవి ఉండే కదా..!

–సూర్య, చిత్తూరు

ఫిర్యాదు చేయండి

స్టాంప్ వెండర్లు ఎక్కువ ధరలకు అమ్మితే సహించేది లేదు. దీనిపై ఇదివరకే ఆదేశాలు జారీ చేశాం. ఎక్కువ ధరకు పేపర్లు విక్రయిస్తే వినియోగదారులు నేరుగా సంబంధిత సబ్ రిజిస్ట్రార్లకు ఫిర్యాదు చేయండి. వారు స్పందించని పక్షంలో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సమస్యను తెలుపవచ్చు. ప్రస్తుతం రూ.10, రూ.20 విలువైన పేపర్లు స్టాక్ లేదు. స్టాంప్ పేపరు అవసరమని ఉన్నతాధికారులకు తెలియజేశాం.

–మునిశంకరయ్య, జిల్లా రిజిస్ట్రార్

పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్

బంగారుపాళెం: స్థానిక పశు వైద్యశాల ఆవరణలో శుక్రవారం పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్ చేపట్టారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో పెంపుడు కుక్కలకు నట్టల నివారణతోపాటు రేబిస్ నిరోధక టీకాలు వేశారు. సుమారు 100 కుక్కలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ అసిఫ్ మాట్లాడుతూ కుక్కల సంరక్షణపై యజమానులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. సకాలంలో ఆహారం తీసుకుంటున్నాయా అనే విషయాన్ని గమనించాలని సూచించారు. కార్యక్రమంలో పశు వైద్యులు విజయ మోహన్, మోహన్‌బాబు, పృథ్వీచరణ్, దినేష్, దత్త కుమారి, ట్రైనీ డాక్టర్ లీలావతి పాల్గొన్నారు.



కుక్కలను పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది

క్రీడలూ ముఖ్యమే

- క్రీడాకారిణులకు అభినందనతో ప్రిన్సిపల్ మనోహర్

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమేనని సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఆ కళాశాలలో క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, తమ కళాశాల విద్యార్థులు ఈ నెల 27 జరగబోయే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రీడలకు ఎంపికయ్యారన్నారు. బీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థిని హేమలత ఖో-ఖో పోటీలకు, బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న కుమారి సంధ్య హాకీ పోటీలకు ఎంపికయ్యారని, సౌత్‌జోన్ వర్సిటీ పోటీల్లో ప్రతిభ చాటి కళాశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఆ విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ నరేంద్ర, ఫిజికల్ డైరెక్టర్ సురేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ మనోహర్

కాలేజీలో వైద్య శిబిరానికి స్పందన

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం జూనియర్ కళాశాలలో శుక్రవారం సత్య సాయి ట్రస్ట్ నిర్వహించిన వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. అగర్వాల్ కంటి ఆసుపత్రి, వింగ్ హెల్త్ సెంటర్ నిర్వాహకులు విద్యార్థినీ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. నేత్ర సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి కళ్లద్దాలు, మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శరత్ చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ హర్ష, సత్యసాయి సభ్యులు మనోహర్, షణ్ముగం, మధు, శంకర్ పాల్గొన్నారు.



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్య నిపుణుడు

నేడు డయల్ యువర్ డీఎం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఐరాల, బంగారుపాళ్యం, యాదమరి, గుడిపాల చిత్తూరు వన్‌డిపో పరిధిలోని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న టీపీఓ నాగేంద్ర

చిత్తూరు అర్బన్: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు, లైసెన్స్ ఇంజినీర్లను చిత్తూరు అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర హెచ్చరించారు. శుక్రవారం చిత్తూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. టౌన్ ప్లానింగ్‌కు సంబంధించిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. నగరంలో అక్రమ కట్టడాలు, రోడ్డు ఆక్రమణలు గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో టీపీఓ శుభప్రద, సర్వేయర్ పాల్గొన్నారు.

సారా స్థావరాలపై 'ఎక్సైజ్' దాడులు

చిత్తూరు అర్బన్: సారా తయారీకి స్వస్తి పలకకపోతే పీడీ యాక్టు నమోదు చేస్తామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ శ్రీహరిరెడ్డి హెచ్చరించారు. గుడిపాల మండలం రాసనపల్లె సారా తయారీ కేంద్రాలపై శుక్రవారం దాడులు చేశారు. ఈ దాడుల్లో సారా ఊటను ధ్వంసం చేశారు. 2500 లీటర్ల ఊటను పారబోశారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై పైవిధంగా హెచ్చరించారు. సారా తయారీకి స్వస్తి పలికితే జీవనోపాధి కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



ఊటను పారబోస్తున్న ఎక్సైజ్ పోలీసులు

బిందుసేద్యంతో మంచి ఫలితాలు సాధించండి

- రైతులతో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ
- మూడు గ్రామాల్లో వ్యవసాయక్షేత్రాల పరిశీలన

కుప్పం రూరల్: రైతులు ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న బిందుసేద్యం పరికరాలను సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన కుప్పం మండలం దాసేగౌనూరు, గోపనపల్లె, మంకలదొడ్డిలోని వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. వ్యవసాయాన్నిలాభసాటిగా చేసుకునే దిశగా రైతాంగం పంటలను సాగు చేయాలని, అలాగే తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ దిగుబడి సాధించేందుకు బిందుసేద్యం చేయడం మంచిదని రైతులకు కలెక్టర్ సూచించారు. పాడి పరిశ్రమతో నష్టం తక్కువ అని పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రతి ఒక్కరూ గోకులం షెడ్ల నిర్మాణం చేసుకోవాలని కోరారు. ఎక్కడ నిర్మాణంలో నాణ్యతా లోపాలు లేకుండా చూడాలన్నారు. ఈ గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న గోకులం షెడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని రైతులు, అధికారులను ఆదేశించారు. అనంతరం రైతులతో పంటల సాగు, మార్కెట్ సదుపాయం వంటి విషయాలపై చర్చించారు. కడా పీడీ వికాస్ మర్మత్, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.



రైతులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ఈరోజు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం నిర్వహించనున్నట్లు పార్టీ శ్రేణులు తెలిపాయి. ఉదయం 8.30 గంటలకు చిత్తూరు రూరల్ మండలం పాలూరు పంచాయతీ పాలంతోపు వద్ద నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి కేక్ కట్ చేస్తారు. అనంతరం 9.30 గంటలకు నగరంలోని పార్టీ కార్యాలయంలో వేడుకలు, 10 గంటలకు పాత బస్టాండ్, 10.30 గిరింపేట సర్కిల్, తర్వాత దర్గా సర్కిల్, 11 గంటలకు ప్రభుత్వ ఆస్పత్రిలో కేక్ కటింగ్, అన్నదానం చేయనున్నారు. అలాగే గాంధీరోడ్డు, కట్టమంచి, మురకంబట్టు, సంతపేట, సాయంత్రం ఎల్‌బీపురంలో వేడుకలు నిర్వహిస్తారు.

గుడిపాలలో..

గుడిపాల: మండల కేంద్రంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ప్రకాష్ తెలిపారు. ముఖ్య అతిథిగా చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి హాజరవుతారన్నారు. కేక్ కటింగ్ అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

ఐరాలలో..

ఐరాల: స్థానిక బజారు వీధిలో శనివారం ఉదయం 9.30 గంటలకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కేక్ కట్ చేసిన అనంతరం పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.





ఫారెస్టులో జాగ్రత్త సుమా!



వాకింగ్ ట్రాక్‌పై కూలిన ఎర్రచందనం వృక్షం



వాకింగ్ ట్రాక్ పక్కనే నేలకొరిగిన భారీ చింత చెట్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని రిజర్వు ఫారెస్టు (నగరవనం)లో వాకింగ్ వెళ్లే వాళ్లు చూపు కాస్త దగ్గర పెట్టుకుని నడవాల్సిన సమయం వచ్చింది. ప్రజలకు స్వచ్ఛమైన ప్రాణ వాయువు అందుతున్న వాటిల్లో దేశంలోనే చిత్తూరుకు సైతం స్థానం ఉంది. అది కేవలం నగర నడిబొడ్డున ఉన్న రిజర్వు ఫారెస్టు. ఇక్కడున్న అపారమైన వృక్ష సంపద, ఎర్రచందనం చెట్లు. వీటిల్లోంచి వచ్చే ఔషధ గుణాలున్న గాలి.. కలుషితమవుతున్న గాలిని శుద్ధి చేయడంతో పాటు ప్రజలకు స్వచ్ఛమైన ప్రాణవాయువును అందిస్తోంది. దీంతో ఎక్కువ మంది ప్రజలు ఫారెస్టు లోపల వాకింగ్ వెళుతుంటారు. దాదాపు 40 ఏళ్లకు పైనే ప్రజలు రిజర్వు ఫారెస్టు లోపల వాకింగ్ చేయడం మొదలుపెట్టారు. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఫారెస్టు లోపల భారీ వృక్షాలు నేలకొరుగుతున్నాయి. ప్రధానంగా వాకింగ్ ట్రాక్‌కు పక్కనే ఆనుకుని ఉన్న ఎర్రచందనం చెట్లు పట్టుకోల్పోతున్నాయి. ఉన్నట్టుండి వాకింగ్ ట్రాక్‌పై వృక్షాలు పడిపోతున్నాయి. ఎర్రచందనం వృక్షాలతో పాటు కొన్నిచోట్ల భారీ చింత చెట్లు కూడా నేలకొరుగుతున్నాయి. వాకింగ్ చేసే ప్రజలు కాస్త నిశితంగా వృక్షాలను పరిశీలించి నడక సాగిస్తే మంచిది. లేకుంటే ఉపద్రవం ఏ రూపంలో వస్తుందో చెప్పలేని పరిస్థితి.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు



విద్యార్థులకు దుప్పట్లు వితరణ చేస్తున్న బాల గురునాథ్

వి.కోట: వాణి విద్యాసంస్థల అధినేత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాల గురునాథ్ శుక్రవారం స్థానిక ఎస్సీ హాస్టల్‌లో వందమంది విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. దుప్పట్లతో పాటు పండ్లు వితరణ చేశారు. చలికాలంలో తమకు ఇబ్బందులు లేకుండా దుప్పట్లు ఇవ్వడం ఆనందంగా ఉందని విద్యార్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ఎంపీపీ తమీమ్, నాయకులు ధీరజ్, కృష్ణమూర్తి, మురళి, హాస్టల్ వార్డెన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.